
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.2, కనిష్ఠం 17.3



నిజామాబాద్

జిల్లా వార్తలు

సోమవారం 18 నవంబరు 2024



నాందేడ్ ఎయిర్ పోర్టులో సీఎం రేవంత్‌రెడ్డి

'మహా' ఎన్నికల ప్రచారంలో మనోళ్లు!

- నాందేడ్ జిల్లా భోకర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- కొన్ని రోజులుగా ప్రచారంలో పాల్గొంటున్న ఉమ్మడి జిల్లాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నేతలు

నిజామాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో నిజామాబాద్ ఉమ్మడి జిల్లా నేతలు పాల్గొంటున్నారు. పోలింగ్ గడువు సమీపిస్తుండడంతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులతో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన ముఖ్య నేతలు పాల్గొంటున్నారు. కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున ప్రచారం నిర్వహిస్తున్నారు. నాందేడ్ జిల్లాలో ఉండి అన్ని నియోజకవర్గాల్లో తిరుగుతూ పూర్తిస్థాయిలో అక్కడే ఉంటూ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఈనెల 20న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుండటంతో చివరి ప్రయత్నాలను చేస్తున్నారు. నిజామాబాద్ ఉమ్మడి జిల్లాతో పాటు ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల సరిహద్దుల్లో ఉన్న నియోజకవర్గాలపై కేంద్రీకరించి కాంగ్రెస్ నేతలు పనిచేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలతో సత్సంబంధాలు ఉండటం బంధుత్వాలు ఉండటం వల్ల ప్రచారాలను కొనసాగిస్తున్నారు. అభ్యర్థుల గెలుపు కోసం ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. వీరితో పాటు బీజేపీ నేతలు కూడా తమ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు పార్టీ నేతలు మహారాష్ట్రలో ఉండి ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. నేటితో ప్రచారం ముగుస్తుండటంతో చివరి ప్రయత్నాలను ఇరు పార్టీల నేతలు కొనసాగిస్తున్నారు.

నేటితో ముగియనున్న ప్రచారం


మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ చివరి దశకు చేరుకుంది. సోమవారంతో ప్రచారం ముగియనుంది. ఈ ఎన్నికలు కాంగ్రెస్, బీజేపీ రాష్ట్ర నేతలతో పాటు ఉమ్మడి జిల్లా నేతలు పాల్గొంటున్నారు.

మిగతా 8వ పేజీలో...



మహారాష్ట్రలో మాజీ సీఎం అశోక్ చౌహాన్‌తో కలిసి ప్రచారంలో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

మొదలైన యాసంగి



- మొక్కజొన్న, ఎర్రజొన్న సాగును మొదలు పెట్టిన రైతులు
- ఈ సీజన్‌లో కూడా అధికంగా సాగు కానున్న వరి
- ఎరువులు, విత్తనాలను అందుబాటులోకి తెచ్చిన వ్యవసాయ శాఖ

నిజామాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో యాసంగి సాగు మొదలైంది. రైతులు ఆరుతడి పంటల సాగును మొదలు పెట్టారు. మొక్కజొన్న, ఎర్రజొన్న పంటలతో పాటు ఇతర పంటలను సాగు చేస్తున్నారు. వానాకాలం పంటలు తుది దశకు చేరుకోవడంతో ఆరుతడి పంటల సాగును కొనసాగిస్తున్నారు. వరి కోతలను చేస్తూనే యాసంగిలో సాగుకోసం నారుమళ్లను సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో నీటివనరులు పుష్కలంగా ఉండటం, చెరువులు, ప్రాజెక్టులలో నీటి నిల్వలు పూర్తిస్థాయిలో ఉండటంతో మళ్లీ పెద్ద ఎత్తున సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. వరితో పాటు ఇతర పంటలను సాగు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భూగర్భ జలాలు ఎక్కువగా ఉండటంతో వ్యవసాయ శాఖ అధికారులు కూడా యాసంగి సాగుకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచారు. పంటల సాగు మొదలు కావడంతో ఎరువులను కూడా అందుబాటులోకి తెచ్చారు. డీఏపీతో పాటు యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువులను రైతులకు ఇబ్బందులు లేకుండా ఉండే విధంగా నిల్వలను సిద్ధం చేశారు. డీఏపీకి బదులు ఇతర కాంప్లెక్స్ ఎరువులను ఎక్కువ మొత్తంలో వాడేందుకు అవగాహన కల్పిస్తున్నారు.

యాసంగి సాగుకు ప్రణాళికలు సిద్ధం

జిల్లాలో యాసంగి సాగుకు వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళికను నెలరోజుల ముందే సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఈ యాసంగిలో 5లక్షల 18వేల ఎకరాలకు పైగా సాగు అవుతుందని అంచనా వేశారు. ఈ యాసంగిలో కూడా చెరువులు, ప్రాజెక్టులలో నీళ్ల ఎక్కువగా ఉండటంతో వరిసాగుకే రైతులు మొగ్గు చూపుతారని అంచనాకు వచ్చారు. జిల్లాలో 4లక్షల 19వేల 486 ఎకరాల్లో పంట వేస్తారని ప్రణాళికలో పొందుపర్చారు. జిల్లాలో మొక్కజొన్న 22,986 ఎకరాలు, శనగలు 16,076 ఎకరాలు, మినుములు 619 ఎకరాలు, జొన్న 10,302 ఎకరాలు, నువ్వులు 8,239 ఎకరాలు, పొద్దుతిరుగుడు 2,790 ఎకరాలు, ఎర్రజొన్న 33,310 ఎకరాల్లో సాగు అవుతుందని అంచనా వేశారు. ఇవేకాకుండా ఇతర పంటలను సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేశారు. జిల్లాలో శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టులు నిండుగా ఉండటం వల్ల వరిసాగు ఎక్కువగా వేస్తారని అంచనాకు వచ్చారు. జిల్లాలో సాగు అయ్యే మొత్తం విస్తీర్ణంలో 75 శాతం వరకు ఈ పంటనే సాగు చేస్తారని అంచనా వేశారు. ప్రాజెక్టులతో పాటు చెరువులు నిండుగా ఉండటం భూగర్భ జలాలు కూడా ఎక్కువగా ఉండటం విద్యుత్ సరఫరా కొనసాగుతుండటం వల్ల యాసంగిలో కూడా భారీ ఎత్తున సాగు అవుతుందని అంచనాకు వచ్చారు. గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల పథకాల కింద కూడా వరిసాగు ఎక్కువ అవుతుందని అంచనా వేశారు.

విత్తన డీలర్లతో రైతుల ఒప్పందాలు

వ్యవసాయ శాఖ అధికారుల అంచనాల ప్రకారం జిల్లాలో యాసంగి సాగు మొదలైంది. జిల్లా వ్యాప్తంగా రైతులు సాగును కొనసాగిస్తున్నారు. ఆరుతడి పంటల్లో భాగంగా మొక్కజొన్న, ఎర్రజొన్న సాగును కొనసాగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ రెండు పంటలను ప్రస్తుతం రైతులు ఎక్కువగా వేస్తున్నారు. సీజన్ మొదలుకావడంతో ఎర్రజొన్నకు అవసరమైన వాతావరణం ఉండటం వల్ల రైతులు విత్తన డీలర్లతో ఒప్పందం చేసుకొని ఈ పంటను వేస్తున్నారు. గడిచిన కొన్నేళ్లుగా రైతులు ఈ ఎర్రజొన్నను సాగు చేస్తుండగా గత నాలుగేళ్లుగా ధర పెరగడంతో పాటు దిగుబడి పెరగడం వల్ల రైతులకు ఎక్కువ మొత్తంలో గిట్టుబాటు అవుతుండటం వల్ల సాగును కొనసాగిస్తున్నారు. ఈ రెండు పంటలు సాగు చేయడంతో పాటు వరి కోతలు పూర్తవుతున్నందున నారుమళ్లను యాసంగి సాగు కోసం సిద్ధం చేస్తున్నారు. బోధన్ డివిజన్ పరిధిలో నెలరోజుల ముందే వరి కోతలు చేసిన రైతులు నారుమళ్లను వేశారు. ఈనెలాఖరు నుంచి వరినాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇతర ప్రాంతాల్లోని రైతులు మాత్రం వరి కోస్తూనే నారుమళ్లను సిద్ధం చేస్తున్నారు. డిసెంబర్ నెల నుంచి నాట్లు మొదలు కానుండటంతో ఎక్కువ మొత్తంలో రైతులు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

అందుబాటులో విత్తనాలు

జిల్లాలో యాసంగి సాగు ఎక్కువగా కానుండటంతో విత్తనాలను కూడా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అందుబాటులో ఉంచారు. ప్రాథమిక వ్యవసాయ

మిగతా 8వ పేజీలో...

కలగానే బస్ డిపో నిర్మాణం

- నందిపేటకు 30 ఏళ్లుగా లభించని మోక్షం
- పనికిరాని ఈడీ రహస్య పర్యటనలు
- వృథాగా మారిన ఫొటోలు, వీడియో చిత్రీకరణ
- బీజేపీ ఆమరణ దీక్షకు దక్కని ఫలితం

నందిపేటలో బస్‌డిపోకు కేటాయించిన స్థలం ఇదే..



బిల్లులు చెల్లించరు.. పనులు పూర్తి చేయరు!

- మన ఊరు-మన బడి కింద అచ్చంపేట జడ్పీ పాఠశాలకు రూ.1.43 లక్షలు మంజూరు
- ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాని పనులు
- రెండేళ్లుగా నిలిచిపోయిన గదుల నిర్మాణం
- చేసిన పనులకు బిల్లులు రానందునే పనులు చేపట్టడం లేదని ఆరోపణలు

7



● అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

గ్రూప్-3 పరీక్షలు ప్రారంభం





నిజామాబాద్ అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్-3 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. ఆదివారం ఉదయం జరిగిన మొదటి సెషన్ పరీక్షకు జిల్లాలో మొత్తం 19,941 మంది అభ్యర్థులకు గాను 10,037 మంది హాజరుకాగా 9,904 మంది గైర్హాజరయ్యారు. ఉదయం సెషన్‌లో 50.33 శాతం హాజరు నమోదైంది. మధ్యాహ్నం సెషన్‌కు 9,992 మంది అభ్యర్థులు హాజరుకాగా 9,949 మంది గైర్హాజరయ్యారు. సెకండ్ సెషన్ పరీక్షకు 50.10 శాతం హాజరు నమోదైంది. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు జరిగే గ్రూప్-3 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. ఉదయం 9.30 గంటలకే పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేయడం జరుగుతుందని అనంతరం లోనికి అనుమతించడం జరగదని, అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాల్లోకి చేరుకోవాలన్నారు. గ్రూప్-3 పరీక్ష కేంద్రాలను నిజామాబాద్ ఇన్‌చార్జి సీపీ సీహెచ్ సింధూశర్మ పరిశీలించారు. మధ్యాహ్నం సెషన్‌లో తెలంగాణ యూనివర్సిటీ, నగరంలోని ఎస్‌ఆర్ డీసీ స్కూల్, ఉమెన్స్ కళాశాల పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. పరీక్ష పత్రాల తరలింపు గురించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. 66 పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉందని ఆమె తెలిపారు. ఆమె వెంట అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) కోటేశ్వర్‌రావు, తదితరులు ఉన్నారు.





టీయూలో భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ

ముగిసిన ఈషా గ్రామోత్సవ క్రీడలు



త్రోబాల్ ఆడుతున్న క్రీడాకారులు

- వాలీబాల్‌లో విజేత కమ్మర్‌పల్లి
- త్రోబాల్ విజేత నడిపల్లి తండా వారియర్స్

సుభాష్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత క్రీడాకారులను వెలికితీయాలనే ఉద్దేశ్యంతో నిర్వహిస్తున్న 16వ ఈషా గ్రామోత్సవ క్రీడలు ముగిశాయి. ఈ పోటీలో వాలీబాల్ విజేతగా కమ్మర్‌పల్లి జట్టు, త్రోబాల్ విజేతగా నడిపల్లి తండా వారియర్స్ జట్టు నిలిచింది. ఆదివారం ఉదయం నుంచి వాలీబాల్, త్రోబాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. వాలీబాల్ ఫైనల్ పోటీలో కమ్మర్‌పల్లి, కొండాపూర్ జట్లు తలపడగా కమ్మర్‌పల్లి జట్టు విజేతగా నిలిచింది. 3-4 స్థానాల్లో పోచంపాడ్ జట్టు నిలిచాయి. త్రోబాల్ మహిళల విభాగంలో పోటీలు జరగగా నడిపల్లి తండా వారియర్స్ పవర్ వారియర్స్ జట్ల మధ్య హోరాహోరీ పోటీలు జరగగా నడిపల్లి తండా వారియర్స్ జట్టు విజేతగా నిలిచింది. 3-4 స్థానాల్లో డీఎస్‌ఆర్ రైజర్స్, మల్కాపూర్ వారియర్స్ జట్టు విజేతలుగా నిలిచాయి. విజేతలకు ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, గంగాస్థాన్ ఎస్‌బీఐ మేనేజర్ నాగేంద్రమ్మ, నగదు బహుమతులతో పాటు మెమోంటోలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈషా ఫౌండేషన్ మంచి ఉద్దేశ్యంతో ఈ పోటీలను నిర్వహించిందని అన్నారు. ఈ పోటీలలో ఉత్సాహంగా 20 వాలీబాల్ జట్లు, 5 త్రోబాల్ జట్లు పాల్గొని తమ ప్రతిభను చాటాయని అన్నారు. అనంతరం ఈషా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ.. 2004లో సద్గురు ప్రారంభించిన ఈషా గ్రామోత్సవం గ్రామీణ భారత దేశ స్ఫూర్తిని పునర్జీవింపజేయడానికి ఉద్దేశించిందన్నారు. ఈ పోటీలలో ఇప్పటి వరకు 8,412 జట్లు లక్షా 167 మంది క్రీడాకారులు పాల్గొన్నారని అన్నారు. ఈయే డాదిలో 126 ప్రదేశాల నుంచి 80వేల మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటు న్నారని అన్నారు. నవంబర్ 16 నుంచి 28 వరకు క్లస్టర్ డివిజనల్, ఫైనల్ దశల్లో మ్యాచ్‌లు జరుగుతాయని అన్నారు. డిసెంబర్ 28న ఈషా యోగా సెంటర్ కోయంబత్తూర్‌లోని ఆదియోగి వద్ద ఫైనల్ ఈవెంట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. విజేతలకు 5లక్షల బహుమతులు అందజేయబడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈషా ఫౌండేషన్ ప్రతినిధులు డాక్టర్ ఇంద్రాక్షిణి, భాగేషా, కిశోర్, హరీష్, పృథ్వీ, వెంకటేశ్, రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.



మొదటి విజేతగా నిలిచిన కమ్మర్‌పల్లి వాలీబాల్ జట్టు



మొదటి విజేతగా నిలిచిన నడిపల్లి తండా త్రోబాల్ జట్టు

దేశంలో కులగణన ఆపుతోంది మోదీనే

● కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్

నిజామాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దేశంలో కులగణన జరగకుండా ఆపుతున్నది ప్రధాని మోదీనేనని మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ ఆరోపించారు. నగరంలో ఆదివారం జరిగిన పద్మశాలి కల్యాణ మండపం పునఃప్రారంభోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బీసీలు తిరగబడతారనే భయంతోనే కులగణనను అడ్డుకుంటున్నారని ఆయన విమర్శించారు. బీసీలందరూ కులగణనలో పాల్గొని తమ వాటాను సాధించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు 27 శాతమే రిజర్వేషన్లు ఉన్నాయని ఆయన అన్నారు. విద్యా, ఉద్యోగం, ఇతర రంగాల్లో బీసీలకు అన్యాయం జరుగుతుం దన్నారు. పద్మశాలీల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు వారి అభివృద్ధికి పాటు పడతానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కేశవేణు, కాంగ్రెస్ నేత నరాల రత్నాకర్, పద్మశాలి నగర అధ్యక్షుడు గుజ్జేటి వెంకట నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈరవత్రి అనిల్

విద్యుత్‌వైర్లు తగిలి డీసీఎం వాహనం దగ్ధం



కొత్తపల్లి వద్ద డీసీఎం వాహనం మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ముప్కాల్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలు తగిలి డీసీఎం వాహనం దగ్ధమైన సంఘటన ముప్కాల్ మండలం కొత్తపల్లి గ్రామంలో చోటు చేసుకుంది.ఈసంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.ఆర్మూర్‌నుంచి ధాన్యం సేకరణ కోసం ఐచర్‌వ్యాన్ తడ్ పాకల్‌కు వెళ్తుండగా మార్గ మధ్యం ముప్కాల్ మండలం కొత్తపల్లి వెళ్తుండగా విద్యుత్ తీగలు కిందకు ఉండడం వల్ల వాహనానికి తగిలి టైర్ల లో మంటలు చేలరెగాయి.అంతలో డ్రైవర్ తయాబ్‌ను స్థానికులు బయటకు తీయడంతో తీవ్రగాయాలు అయ్యాయి.స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో బాల్కొండ నుంచి అగ్నిమాపక వాహనం వచ్చి డీసీఎం వాహనం మంటలను అర్పివేశారు. దీంతోడీసీ ఎం ముందు బాగం పూర్తిగా కాలిపోయింది. డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.స్థానికంగా లైన్‌మెన్ లేకపోవడంతో విద్యుత్ నిలిపివేయడంలో ఆలస్యమైందని స్థానికులు తెలిపారు.

మహ గంగా హారతి పోస్టర్లు ఆవిష్కరణ



నందిపేటలో మహా గంగా హారతి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంగి రాములు

నందిపేట, నవంబరు17: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న పలు గుట్టపై ఆదివారం మహ గంగా హారతి పోస్టర్లను శ్రీ కేదారేశ్వర ఆశ్రమం వ్యవస్థాపకులు శ్రీ మంగి రాములు మహరాజ్ ఆవిష్కరించారు. ఈ నెల 20న ఉమ్మెడలోని శ్రీ ఉమా మహేశ్వర ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో గోదావరి నదిలో మహ గంగా హారతి కార్యక్రమం జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్తీక మాసంలో భాగంగా బాసర గోదావరి నదిలో గంగాహారతి జరిగిన తరువాత ఉమ్మెడ శివారులోని బ్రిడ్జి వద్ద మహాగంగా హారతి కార్యక్రమం బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య జరుగుతుందని గ్రామస్తులు వివరించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులు, ఉమా మహేశ్వర ఆలయం భక్తులు హజరు కావాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాముడ పోశెట్టి, మాజీ ఎంపీటీసీ సభ్యులు మక్కూర్ మనోజ్ రావు, దూద వెంకటేష్, వివిధ పార్టీల నాయకులు తధితరులు ఉన్నారు.

సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

బోధన్‌రూరల్,నవంబరు17(ఆంధ్రజ్యోతి): బోధన్ డివిజన్‌లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వేను పకడ్బందిగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోధన్ డివిజన్‌లోని అన్ని మండలాల్లో సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో ఎన్యూమలేటర్లు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం ప్రజల అభివృద్ధి,సంక్షేమం, భవిష్యత్ అవసరాల కోసం చేపడుతున్న సర్వేలో ఎన్యూమలేటర్లకు ప్రజలు పూర్తిస్థాయి సమాచారం ఇచ్చిసహకరించాలన్నారు. ఎన్యూమలేటర్లు పకడ్బందిగా సర్వే నిర్వహించాలన్నారు. సర్వే పట్ల ఎలాంటి నిర్లక్ష్యంవహించరాదన్నారు.

● కొనసాగుతున్న సమగ్ర కుటుంబసర్వే

ఆర్మూర్‌టౌన్:మున్సిపల్ పరిధిలోని పలువార్డులలో ఆదివారం కుటుంబ సర్వే కొనసాగుతుంది. ఇప్పటి వరకు మున్సిపల్ పరిదిలో 48శాతం సమగ్ర కుటుంబ సర్వే పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

కాలువలో పడి వ్యక్తి మృతి



శోభన్ మృతదేహం

మోస్రా,నవంబరు17(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో పెద్దిగారి శోభన్(40) పొలం వద్ద నారుమడికి నీరు పెట్టడానికి వెళ్లేటప్పుడు ప్రమాదవశాత్తు పిల్ల కాలువలో పడి చనిపోయినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. కేసు నమోదు చేసుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

తరగతి గదిలోనే వంటశాల

బోధన్‌రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సాలూర మండలం మందర్నా ప్రాథమికోన్నత పాఠశాలలో తరగతి గదిలోనే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండుతున్నారు. తరగతి గదినే వంట గదిగా మార్చి వంట చేస్తున్న పరిస్థితి నెలకొంది. మధ్యాహ్న భోజనం కోసం వంట చేయడానికి ప్రత్యేక వంటగది లేకపోవడంతో మధ్యాహ్న భోజన కార్మికురాలు తరగతి గదిలోనే వంట చేస్తున్నారు. దీంతో ఉపాధ్యాయులు పక్కనే గల స్టాఫ్ రూమ్‌లో ఇరుకుగా కూర్చుంటున్నారు. తరగతి గదిలో వంట చేస్తుండడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలకు నూతనంగా వచ్చిన డెస్క్, బెంచీలు ఒక దాని మీదు ఒకటి పక్కన పెట్టేశారు. పాఠశాలలో మొత్తం 110మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యార్థుల సౌకర్యార్థం కొత్త బెంచీలు ఉన్న విద్యార్థులు కూర్చోలేని పరిస్థితి నెలకొంది. ఉపాధ్యాయులు ఆఫీసు గదిలో ఒక పక్కన ఇరుకుగా కూర్చుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు వంట గది నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పెంటాఖుర్దులో ఒకరి అదృశ్యం

నవీపేట,నవంబరు17(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలం పెంటాఖుర్దుకు చెందిన అలకుంట చిన్న ఎల్లయ్య(38)అనే వ్యక్తి అదృశ్యమయ్యాడని ఎస్ఐ వినయ్ తెలిపారు. నవీపేట మండలం జన్నేపల్లిలో ఉంటున్న తన సోదరి మక్కల గంగామణి చిన్న ఎల్లయ్యకు 5వేల రూపాయల డబ్బులు ఇవ్వాల్సి ఉందని, ఈ విషయంపై ఈ నెల 14న అతడు జన్నేపల్లిలో ఉంటున్న తన సోదరిని డబ్బులు అడగానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి చేరుకోలేదని అన్నారు. సోదరుడు అలకుంట పెద్ద ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అర్ధాంతరంగా ఆగిన హౌసింగ్ మోడల్ భవనం

● వృథాగా మారిన మోడల్ భవనం ● పట్టించుకోని అధికారులు



వేల్పూర్‌లో వృథాగా మారిన హౌసింగ్ మోడల్ భవనం

వేల్పూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఆయా శాఖల భవనాల నిర్మాణం కోసం నిధులు కేటాయించింది. అసలే భవనాలు లేక నిధులు మంజూరైనా శాఖల భవనాలు అర్ధాంతరంగా ఆగిపోవడం విచా రకం. వేల్పూర్ మండల కేంద్రంలో గతంలో ప్రభుత్వం ప్రత్యేకంగా హౌసింగ్ మోడల్ భవనాన్ని నిర్మించేందుకు నిధులు కేటాయించింది. ఈ భవనం లబ్ధిదారులకు అందుబాటులో ఉండే విధంగా నిర్మించాలనే లక్ష్యంతో మండల పరిషత్ కార్యాలయం సమీపంలో స్థలాన్ని కేటాయించింది. హౌజింగ్ అధికారులు ఈ స్థలంలో భవన నిర్మాణం చేపట్టి దాదాపు ఐదేళ్ల పూర్తయినప్పటికీ చేయవలసిన మిగతా పనులను చేయకపోవడం విడ్డూరంగా ఉంది. నిర్మాణం చేపట్టి ఆరేళ్ల గడిచిన కనీసం అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం. భవన నిర్మాణం చేపట్టి తలుపులు బిగించకపోవడంతో ఈ భవనంలో చట్టవ్యతిరేక కార్యాకలాపాలు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిపోయింది. ప్రభుత్వం హౌసింగ్ శాఖను, ఇతర శాఖల్లో విలీనం చేయడంతో దీన్ని పట్టించుకోనే వారు కరవయ్యారు. ఈ భవనం పూర్తి చేయడం కోసం కేటాయించిన నిధులు ఎమయ్యాయో తెలియదు. ఈ భవనంపై అజామాయిషి లేకపోవడంతో ప్రభుత్వం నిధులు దుర్వినియోగం కావడమే గాక వృథాగా మారడంతో మండల ప్రజలు తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ భవనాన్ని పూర్తిస్థాయిలో నిర్మించి కార్యాలయంలేని వివిధ ప్రభుత్వ శాఖలకు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు. మండల ప్రజలకు, ప్రభుత్వ ఉద్యోగులకు ఏ మాత్రం పనికి రాకుండా పోతున్న ఈ భవనాన్ని అధికారులు, పాలకులు శ్రద్ధ తీసుకొని వినియో గంలోకి తేవాల్సిన బాధ్యత ప్రభుత్వం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

జేఈ మెయిన్స్ దరఖాస్తు సమస్యలపై ఎంపీ సురేష్‌రెడ్డికి వినతి



ఎంపీ సురేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఆర్మూర్‌రూరల్, నవంబర్17(ఆంధ్రజ్యోతి): వామపక్షాల విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జేఈ మెయిన్స్ దరఖాస్తు సమస్యలపై రాజ్యసభ సభ్యుడు కేఆర్.సురేష్ రెడ్డికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఆర్మూర్ పట్టణంలో ఎంపీ సురేష్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసి సమస్యలను వివరించారు. జేఈ మెయిన్స్ దరఖాస్తు చేసుకోవడానికి ఆధార్‌కార్డు, ఎస్ఎస్‌సీ మెమో ప్రకారం ఉంటేనే దరఖాస్తులు తీసుకుంటున్నారని, మెమో, ఆధార్‌కార్డులో ఒక అక్షరం తేడా ఉన్న దరఖాస్తు తీసుకోవడంలేదని వారు వివరించారు. ఇట్టి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరగా స్పందించిన ఎంపీ సురేష్‌రెడ్డి డిల్లీలో సంబంధిత కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్ళి సమస్య పరిష్కరించేలా తనవంతు కృషి చేస్తానని విద్యార్థి సంఘాల నాయకులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్దుల నాగరాజు, పీడీఎస్‌యు జిల్లా అధ్యక్షుడు నరేందర్, బీఆర్ఎస్‌వీ జిల్లా నాయకులు షహీద్, మండల అధ్యక్షుడు అగ్గు క్రాంతి, ఖలేద్, ఇర్షాద్, అబ్రర్, అజయ్, తాజ్, తదితరులు పాల్గొన్నారు.

విధులకు గైర్హాజరైన గ్రంథ పాలకుడిపై చర్యలు



అర్గుల్‌లోని శాఖ గ్రంథాలయంలో మూత్రశాలలు పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

జక్రాన్‌పల్లి, నవంబరు16(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామాల్లో సొంత భవనాలు లేని గ్రంథాలయాలకు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళి నిధులు మంజూరు చేసి గ్రంథాలయాలకు సొంత భవనాలను నిర్మించేందుకు కృషి చేస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని జక్రాన్‌పల్లి, అర్గుల్ గ్రామాల్లో శాఖ గ్రంథాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని పోచంపాడ్, సిరికొండ, నందిపేట్, నిజామాబాద్‌టౌన్‌లలో గ్రంథాలయాలకు సొంత భవనాలు లేవన్నారు. ఈ గ్రామాల్లో గ్రంథాలయ సొంత భవనాల నిర్మాణానికి నిధుల మంజూరుకు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ తాము కలిసి గ్రంథాలయాల సొంత భవనాల నిర్మాణానికి స్థలాన్ని సేకరించి సొంత గ్రంథాలయ భవనాలు నిర్మిస్తామన్నారు. ఈ గ్రామాల్లో నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి ఒక్కో గ్రంథాలయ భవనానికి రూ.30 నుంచి రూ.40లక్షల నిధులు అవసరం ఉందన్నారు. అలాగే 200గజాల వరకు స్థలం అవసరం ఉందన్నారు. జిల్లాలో గ్రంథాలయాలకు గ్రామపంచాయతీల నుంచి సుమారు మూడు నుంచి నాలుగు కోట్ల సెస్ బకాయిలు ఉన్నాయన్నారు. ఈ బకాయిలను వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రంథాలయాలకు పాఠకులు అధిక సంఖ్యలో వచ్చి చదువుకోవాలని, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో గ్రంథాయాల్లో ఖాళీగా ఉన్న సిబ్బంది పోస్టుల భర్తీకి కృషి చేస్తామన్నారు. గ్రంథాలయంలో వైఫై సౌకర్యం కల్పిస్తామన్నారు. జిల్లాలోని వివిధ శాఖ గ్రంథాలయాల్లో పాఠకులు చదువుకునేందుకు అన్ని రకాల పుస్తకాలను గ్రంథాలయాల్లో ఉంచుతామన్నారు. అర్గుల్‌లోని శాఖ గ్రంథాలయంలో చదువుకోవడానికి వచ్చే పాఠకుల కోసం గ్రంథాలయ భవనంలో మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి త్వరలో వీటిని నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అర్గుల్ ఎం.నర్సయ్య, మండల యువజన విభాగం అధ్యక్షుడు వినోద్, మాజీసర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు గోర్త రాజేందర్, జిల్లా మత్స్యశాఖ మాజీ డైరెక్టర్ టప్పు గంగాధర్, గ్రంథాలయ పాలకుడు నరేష్‌రెడ్డి, అర్గుల్ రిటైర్డు గ్రంథ పాలకుడు చిట్యాల గంగరాం, కాంగ్రెస్ నాయకులు అక్బర్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్: ఏలాంటి సమాచారం లేకుండా విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న భీమ్‌గల్ గ్రంథపాలకుడు గంగాధర్‌గౌడ్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం భీమ్‌గల్ పట్టణంలో అద్దె భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయ శాఖను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. విధుల్లో ఉండాల్సిన సిబ్బందితో కేవలం స్వీపర్ మినహా ఎవరు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రంథ పాలకుడు సమయపాలన పాటించడంలేదని ఫిర్యాదులు వచ్చినట్టు ఆయన తెలిపారు. విద్యార్థులు రావడంతో ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగిందని అన్నా రు. నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయ భవనాన్ని ఆయన పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని డీఈతో ఫోన్‌లో మాట్లాడి ఆదేశించారు. నిధులు ఉన్నప్పటికీ పనుల్లో ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి లైబ్రరిని సొంత భవనంలోకి తేవాలని సూచించారు. లైబ్రరికి వచ్చే రీడర్లు ఏమైన పుస్తకాలు కొరత ఉంటే తనకు నేరుగా ఫోన్ చేయాలని సూచించారు. పాఠకులకు కావల్సిన అన్ని సౌకర్యాలు మెరుగుపర్చాలని సిద్దంగా ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట మాజీఎంపీపీ కన్నె సురేందర్, కాంగ్రెస్ నాయకులు జెజె.నర్సయ్య, నల్లూరి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ఎల్‌వోసి అందజేత

కమ్మర్‌పల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి మండలకేంద్రానికి చెందిన కె.సౌదర్య కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధ పడుతుంది. వైద్య ఖర్చుల (ఆపరేషన్ నిమిత్తం) నిమిత్తం రెండున్నర లక్షల ఎల్‌వోసీని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆదివారం అందజేశారు. తల్లితండ్రి లేని ఈమె ఆపరేషన్ చేయించుకోలేని పరిస్థితిలో ఉండగా ఈ విషయం తన అనుచర వర్గం ద్వార తెలుసుకున్న ఎమ్మెల్యే హైదరాబాద్ లోని నిమ్స్ అసుపత్రిలో గుండె ఆపరేషన్ చేయించుకునే నిమిత్తం ఎల్‌వోసీని మంజూరుచేయించి బాదితురాలికి ఎల్‌వోసీ ప్రతిని అందజేశారు. తనకు ఎల్‌వోసీ మంజూరు చేయించిన ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డికి, స్థానిక బీఆర్ఎస్ నాయకులకు బాధితురాలు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత కేటీఆర్‌కు లేదు

● ప్రజలు చీకొట్టిన అహంకారం తగ్గలేదు

● పీసీసీ అధికార ప్రతినిధి ఏబీ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ అధికార ప్రతినిధి ఏబీ శ్రీనివాస్

ఆర్మూర్‌టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత కేటీఆర్‌కు లేదని, ప్రజలు చీకొట్టిన అహంకారం తగ్గలేదని పీసీసీ అధికార ప్రతినిధి ఏబీ.శ్రీనివాస్(చిన్నా) అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏబీ శ్రీనివాస్ మాట్లాడుతూ గత పదేళ్లుగా బీఆర్ఎస్ పార్టీ అబద్దపు హామీలు చేసిందని, ప్రజలు వారి పాలనను అసహించుకున్నారని, అయినను కేటీఆర్‌కు అహంకారం తగ్గలేదని, ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలను అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ముఖ్య మంత్రి, 12 మంది మంత్రులపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యాలను ఆయన ఖండిం చారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హమీ మేరకు ఆరు గ్యారంటి వంద శాతం అమలు చేస్తామని, అందులో భాగంగా రైతులకు రుణమాఫీ, ఉచిత బస్సు, రూ.500సిలిండర్, 60వేల ఉద్యోగాలు, ఇంట్రిగేటెడ్ స్కూళ్లు, ఆరోగ్యశ్రీ రూ.10లక్షలు పెంచామని, ఇంకా ఎన్నో హమీలు అమలు చేస్తామని అన్నారు. గత పాలనలో కేటీఆర్ ఆర్మూర్ నియోజకవర్గానికి ఇచ్చిన హమీలు అన్ని అబద్దాపు హమీలని, దమ్ముంటే ఆర్మూర్ సాక్షిగా చర్చిద్దామని సవాల్ విసిరారు. కేటీఆర్ కుటుంబ అంతా తెలంగాణను దోచుకుందని, కాళేశ్వరం స్కామ్ ఎంత పెద్దదో అందరికీ తెలుసన్నారు. అనంతరం ఇటీవల నియమితులైన మార్కెట్ కమిటీ చైర్మన్ సాయి బాబాగౌడ్‌ను పట్టు శాలువతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు కోల వెంకటేష్, ఎస్టీసెల్ రాష్ట్ర కన్వీనర్ దూదిగాం ప్రమోద్, సీనియర్ నాయకులు అజ్జు, అబి, బట్టు శంకర్, ఫహీం, బోడ మీది బాలకిషన్, ఫయాజ్, శేక్‌పాషా, రాజ్‌కుమార్, రమణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఉషూ పోటీలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

● ప్రతిభ కనబరిచిన పోచంపాడ్ లిటిల్ ఫ్లవర్ విద్యార్థులు




లిటిల్‌ఫ్లవర్ క్రీడాకారులకు ప్రథమ బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే

వేల్పూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ, స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉషా రాష్ట్రస్థాయి క్రీడా ముగింపు పోటీల్లో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి హాజరై గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. నిజామాబాద్ జిల్లా పోచంపాడ్ లిటిల్ ఫ్లవర్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చగా ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి దమాట్లాడుతూ ముప్కాల్‌లో ఇండోర్ స్టేడియంలో జరిగిన ఒక రోజు ఉషా రాష్ట్రస్థాయి 7వ క్రీడా పోటీలు చేపట్టడం సంతోషం వ్యక్తం చేశారు. మండలంలోని యువతి, యువకులు అధిక సంఖ్యలో క్రీడలపై ఆసక్తి చూడాలన్నారు. ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమి సభ్యులు కె.గంగాధర్, అంజయ్యలకు కృతజ్ఞతలను తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయకుడు సంతోష్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సిద్ది రమేష్, ఏలేటి గంగారెడ్డి, స్పోర్ట్స్ అకాడమి సభ్యులు మోతె గంగారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ రాజ్‌కుమార్, మల్లేష్‌గౌడ్, టి.సాయన్న, సామ వెంకటరెడ్డి, బద్దం నర్సారెడ్డి, జోగు నర్సయ్య, సంజీవ్ థామస్, తదితరులు పాల్గొన్నారు.

కోటగిరిలో అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠాపన

కోటగిరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలో అయ్యప్ప స్వామి, సాయిబాబా దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఆదివారంతో 4వ రోజుకు చేరుకున్నాయి. ఉత్సవాలలో భాగంగా ప్రముఖ వేద పండితులు వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో మహ సుదర్శన హోమం, మహ చండీ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి హజరయ్యారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సోమవారం యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపన, మహ కుంబాభిషేకానికి ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

బీరప్ప మందిర నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ నిర్వహిస్తున్న కుర్మ కులస్థులు

బోధన్‌రూరల్,నవంబరు17(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని కల్దుర్కి గ్రామంలో ఆదివారం బీరప్ప దేవాలయం మందిర నిర్మాణం కొరకు భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. కుర్మ కులస్తుల ఆరాధ్య దైవం అయినటువంటి బీరప్ప దేవాలయం నిర్మాణం కొరకు కుర్మ కులస్థులు అందరు కలిసి భూమిపూజ నిర్వహించామని కుర్మ సంఘం అధ్యక్షులు మేడి రవి, గొర్రెలు, మేకల సహకార సంఘం అధ్యక్షులు దేవు రావు, గంగాధర్ తెలిపారు. బీరప్ప మందిరంకు స్థల దాత సంబాజీ నీలకంఠ విజయ్‌కుమార్‌ను అభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షులు సిరిగిరి రాం, సెక్రెటరీ గౌరుగొండ, సిరిగిరి అశోక్, వీడీసీ చైర్మన్ గంగాధర్, సంఘం సభ్యులు జలేందర్, పీరాజీ, శ్రీనివాస్, మాధవ రావు, శివకాంత్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ

ఆర్మూర్‌టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని కొటార్మూర్‌లో తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడినట్టు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. కొటార్మూర్‌లోని సహీద్ మోహీనోద్దిన్ ఇంటికి తాళం వేసి వేరే గ్రామానికి వెళ్లగా శనివారం రాత్రి గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడి ఇంట్లో ఉన్న 12తులాల బంగారం, 30తులాల వెండి, రూ.30వేల నగదును ఎత్తుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ సంఘటన స్థలాన్ని పరిశీలించి కుటుంబ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

నల్ల పోచమ్మకు ప్రత్యేక పూజలు



నల్ల పోచమ్మకు పూజలు చేస్తున్న మంగి రాములు మహరాజ్

నందిపేట, నవంబరు17: మండల కేంద్రంలోని పలుగుట్టపై ఉన్న నల్ల పోచమ్మకు ఆదివారం శ్రీ కేదారేశ్వర ఆశ్రమం వ్యవస్థాపకులు శ్రీ మంగి రాములు మహరాజ్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించారు. విజయ దశమి సందర్భంగా రాములు మహరాజ్ దీక్షలోకి వెళ్ళి కార్తీక మాసం సందర్భంగా దీక్షను విరమిస్తారు. తరువాత రోజున పెద్ద ఎత్తున జాతర కార్యక్రమాలు, అన్నదానం జరుగుతుంది. మరుసటి రోజున మంగి రాములు మహరాజ్ నల్ల పోచమ్మకు నైవేద్యం సమర్పిస్తారు. ఈ ఆనవాయితి గత 35 సంవత్సరాలు జరుగుతోంది. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

నవీపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోకన్‌పల్లికి చెందిన టేకు కర్ణ(35)అనే ఆటో డ్రైవర్ అప్పుల బాధ తాళలేక తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ వినయ్ తెలిపారు. ఉపాధి నిమిత్తం అప్పులు చేసి కర్ణ గతంలో దుబాయ్ వెళ్లాడని అక్కడ కూడా సరిగ్గా పని లేకపోవడంతో కొద్ది కాలానికే స్వదేశం వచ్చాడని ఆయన పేర్కొన్నారు. ఉపాధి కోసం ఫైనాన్స్‌లో నెలవారి చెల్లింపులపై ప్యాసింజర్ ఆటో కొనుక్కుని నడుపుతున్నారని అన్నారు. ఇటీవల ఆటో ఫైనాన్స్ నెలవారి కిస్తులు సరిగ్గా కట్టలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేసేవాడని ఆయన పేర్కొన్నారు. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య పుష్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన మున్సిపల్ కౌన్సిలర్లు



పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ కండువా వేసి ఆహ్వానిస్తున్న సునీల్‌కుమార్

భీమ్‌గల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ మున్సిపల్ కౌన్సి లర్‌లతో పాటు మండల కోఆప్షన్‌సభ్యులు, ఇతర పార్టీల నాయకులు ఆదివారం బాల్కొండ నియోజకవర్గ కాం గ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. భీమ్‌గల్ ము న్సిపల్ కౌన్సిలర్‌లు సీహెచ్.గంగాధర్, బోర్ లింగం, సర్వసమాజ్ అధ్య క్షుడు శేవ్వ అశోక్, సొసైటీ డైరెక్టర్‌లు దశాగౌడ్, మాజీ సర్పంచ్ బాల గంగాధర్, అక్రమ్, ఇక్రమ్, కో ఆప్షన్‌మెంబర్ అజ్మతుల్లాలు పార్టీలో చేరగా ముత్యాల సునీల్‌కుమార్ కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జెజె.నర్సయ్య, మాజీ ఎంపీపీ కన్నె సురేందర్, మూడెడ్ల జితేందర్, పల్లె శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి

బోధన్‌రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బోధన్ మండలం లంగ్డాపూర్ గ్రామానికి చెందని సుంకరి అనిల్ (30) ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. ఆదివారం ఆకస్మాత్తుగా గుండెపోటు రావడంతో ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందడంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. నిత్యం గ్రామస్థులతో కలిసిమెలిసి ఉండే అనిల్ ఆకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందడం ఆ కుటుంబాన్ని శోకసముద్రంలో ముంచింది. మృతుడికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. యువకుడు గుండెపోటుతో మృతి చెందడం గ్రామస్థులను కలిచివేసింది. అంత్యక్రియలు సోమవారం నిర్వహించడం జరుగుతుందని గ్రామస్థులు తెలిపారు. యువకుడి అకాల మరణంతో గ్రామంతో పాటు కుటుంబంలో విషాద చాయలు అలుముకున్నాయి.

బాధితుడి చికిత్స కోసం ఆర్థిక సాయం

వేల్పూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పడిగెల గ్రామానికి చెందిన ప్రమాద బాధితుడు అప్తాబ్ చికిత్స కోసం వేల్పూర్ హెల్పింగ్ అండ్ సేవ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థిక సహయం అందజేశారు. బాధితుడు నిరుపేద కుటుంబానికి చెందినవాడైనందున దాత కోసం ఎదురుచూస్తుండగా హెల్పింగ్ అండ్ సేవ సంస్థ వారు బాధితుడి గురించి తెలుసుకొని వారి సంస్థ ద్వారా రూ.5వేల ఆర్థిక సాయం అందించి వారి కుటుంబానికి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ అండ్ సేవ సంస్థ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న వేల్పూర్ హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ సభ్యులు

ఫోకస్

• పాఠశాల భవన సముదాయం నిర్మాణం నిలిచిపోయిన దృశ్యం



బిల్లులు చెల్లించరు.. పనులు పూర్తి చేయరు!

- మన ఊరు - మన బడి కింద అచ్చంపేట జిల్లా పరిషత్ పాఠశాలకు రూ.1.43 లక్షలు మంజూరు
- పనులు మొదలై ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాని పనులు
- రెండేళ్లుగా నిలిచిపోయిన పాఠశాల గదుల నిర్మాణం
- చేసిన పనులకు బిల్లులు రానందునే పనులు చేపట్టడం లేదని ఆరోపణలు

నిజాంసాగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మన ఊరు - మన బడి పథకం కింద పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు ముందుకు సాగడంలేదు. రెండేళ్ల కింద పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్‌కు బిల్లులు ప్రభుత్వం చెల్లించడం లేదని నిర్మాణం పనులను నిలిపివేశారు. ఫలితంగా పాఠశాల నిర్వహణకు అనేక పాట్లు పడుతూనే ఉన్నారు. ఫలితంగా పాలకు లు, అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిజాంసాగర్ మండలం అచ్చంపేట గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాల ప్రాథమిక పాఠశాల కొనసాగుతుంది. ఏళ్ల కిందట నిర్మించిన పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకుపోయాయి. 2021, 2022 ఆర్థిక సంవత్సరంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌కు 73 లక్షలు ప్రాథమిక పాఠవాలకు 60 లక్షల రూపాయలు చొప్పున మన ఊరు - మనబడి కార్యక్రమం కిందట రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. పనులను చేజిక్కించుకున్న కాంట్రాక్టర్ 2022లో పురాతన పాఠశాల భవన సముదాయాలను కూల్చి వేసి నూతన భవన సముదాయానికి శ్రీకారం చుట్టారు. మొదట్లో అదనపు గదుల నిర్మాణ పనులు చకచకా కొనసాగాయి. జిల్లా పరిషత్ పాఠశాలకు మూడు గదులు, ప్రాథమిక పాఠశాలకు ఐదు గదుల చొప్పున నిర్మాణం పనులు చేపట్టారు. పాఠశాల ఆవరణలోనే డైనింగ్ హాల్ నిర్మాణం పూర్తి చేశారు. కిచెన్‌షెడ్ మరుగుదొడ్లు, మూత్రశాలనిర్మాణం ఉపాధిహామీ చట్టం కింద నిర్మాణం చేపట్టాల్సిన అధికార యంత్రాంగం మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మాణం చేపట్ట లేకపోతున్నారు. పాఠశాల ఆవరణ జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల గదిలో నిర్మాణం రెండు అంతస్తులుగా నిర్మాణాలు చేశారు. కానీ భవనాలు అసంపూర్తిగా నిర్మాణం పనులు నిలిచిపోయాయి. పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లింపులు చేయకపోవడంతో భవనాలు అసంపూర్తిగా మిగిలిపోయాయని పాఠశాల నిర్వహణ అధికారులకు వివరించనున్నట్లు తెలిసింది. పాఠశాలలు, పాఠశాల భవన సముదాయం పనులు నిలిచిపోవడంతో జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యాభ్యాసం చేసి విద్యార్థులు విద్యార్థినీలు అరకొర వసతుల మధ్య చేయాల్సి వస్తోంది. డైనింగ్ హాల్ నిర్మాణం పనులు పూర్తయిన కనీస సౌకర్యాలు డైనింగ్ హాల్‌లో కరువయ్యాయి. రెండేళ్లుగా నిర్మాణం పనులు కొనసాగినప్పటికీ ప్రభుత్వ అధికార యంత్రాంగం బిల్లులు చెల్లించకపోవడంతో సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. పూర్వ కాలం రాష్ట్ర రాజధానిలోని ప్రాముఖ్యత సంచరించిన అచ్చంపేట పాఠశాల, ఈ పాఠశాల సమస్య వలయంలో కొనసాగుతున్న పాలకులు పట్టించుకోకపోవడం పట్ల గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం పాఠశాల నిర్మాణం చేపడుతున్న కాంట్రాక్టర్‌కు చెల్లించి నిర్మాణం పనులను పూర్తి చేయించాలని గ్రామస్థులు పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.



అసంపూర్తిగా నిలిచిన జిల్లా పరిషత్ పాఠశాల భవన సముదాయం పనులు





భక్తి

గుర్రపు సేవపై భీమ్‌గల్ గ్రామ ఆలయానికి చేరుతున్న స్వామివారు

శ్రీలక్ష్మీనర్సింహునికి ఉద్వాసన బలి ప్రదానం చేస్తున్న వేదపండితులు

వైభవంగా శ్రీలక్ష్మీనర్సింహుని డోలారోహణం

• ముగిసిన బ్రహ్మోత్సవాలు • గ్రామ ఆలయానికి ఉత్సవ మూర్తులు

భీమ్‌గల్, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన నింబాచల క్షేత్రంపై జరుగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజు కమల పుష్కరిణి మండపంపై స్వామివారికి డోల సేవ కార్యక్రమాన్ని అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఉదయం ఉత్సవ ప్రారంభంలో ఆహ్వానితులైన సకల దేవతలకు ఉద్వాసన చేశారు. ధ్వజ అవరోహణము చేసి ఉద్వాసన బలి ప్రదాన మోహరించారు. అనంతరం కమల పుష్కరిణిపై గల మండపానికి శ్రీలక్ష్మీనర్సింహ ఉత్సవ మూర్తులను పల్లకీలో తెచ్చారు. సమస్త భక్తజనం భక్తిశ్రద్ధలతో వీక్షిస్తుండగా లాలీపాటలు పాడుతూ డోలసేవ నిర్వహించారు. డోలసేవతో కొండపై జరుగుతున్న బ్రహ్మోత్సవాలను ముగింపు అయ్యింది. చివరిరోజు కావడంతో భీమ్‌గల్ పట్టణ కేంద్రానికి చెందిన ప్రజలు లక్ష్మీనర్సింహునికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం డోలాసేవ ముగిసిన అనంతరం కల్యాణ ఘట్టంలో అర్చకులు సంతానం లేని మహిళలకు పొలుదారం అందజేశారు. ఒకరోజు ముందుగానే దంపతులు రాత్రివేళల్లో గుట్టపై జాగారం చేసి ఉదయం అర్చకులు అందించిన పోలు దారాన్ని స్వీకరించారు. దీనివల్ల సంతానం లేని మహిళలకు సంతానం కటుగుతుందని భక్తుల అపార నమ్మకం.

గ్రామాలయానికి ఉత్సవ విగ్రహాలు

శ్రీలక్ష్మీనర్సింహుని ఉత్సవ విగ్రహాలు శ్రీవారి కొండ నుంచి భీమ్‌గల్ చేరుకున్నాయి. గుర్రపు సేవపై స్వామిని అలంకరించి ఎంతో ఘనమైన డప్పులు బాజభజంత్రిలతో శ్రీలక్ష్మీనర్సింహుని గ్రామ ఆలయం ఎదుర్కొన్నారు. స్వామి గ్రామ ఆలయానికి చేరుకున్న పిమ్మట సప్తావరుణ పూజ నిర్వహించారు. పూజ ముగిసిన పిమ్మట మహోత్సవ క్షతువును భగవంతుడైన శ్రీలక్ష్మీనర్సింహునికి జలక్షతలతో సమర్పించారు. కార్యక్రమంతో ఉత్సవాలు సమాప్తమయ్యాయి.

లక్ష్మీనర్సింహ స్వామిని దర్శించుకున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి

భీమ్‌గల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అయిన లింబాద్రిగుట్ట లక్ష్మీనర్సింహ స్వామివారిని జిల్లా ప్రధాన న్యాయాధికారి కుంచాల సునీత దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం క్షేత్రానికి కుటుం బసభ్యులతో కలిసి వచ్చారు. ఈ సందర్భంగా ఆర్మూర్ అదనపు న్యాయమూర్తి వేముల దీప్తితో కలిసి ఆమె గర్భాలయంలో స్వామిని దర్శింకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు నంబి పార్థసారథి, నంబి వాసుదేవాచార్యులు వారికి దర్శనం చేయించి, స్వామి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా స్వయంభువుగా వెలిసిన శ్రీ లక్ష్మీ నర్సింహుని క్షేత్రం విశిష్ఠతను కాపాడుతున్న ధర్మకర్తను అభినందించారు. తాను గతంలో కూడా క్షేత్రాన్ని దర్శించుకున్నట్లు తెలిపారు. వీరివెంట సీఐ నవీన్, ఎస్సై మహేష్‌లు ఉన్నారు.



లక్ష్మీనర్సింహుని దర్శించుకున్న జిల్లా న్యాయమూర్తి కుంచాల సునీత

పని చేయని మూడో కన్ను!

• నసురుల్లాబాద్‌లో రాత్రివేళల్లో దొంగతనాలు • పట్టించుకునేందుకు నిఘా లేక పోలీసుల అవస్థలు
• సీసీ కెమెరాల పునరుద్ధరణకు చర్యలు తీసుకునేనా?

నసురుల్లాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండల కేంద్రంలో ప్రతీ వీధికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా అవి మున్నాళ్ల ముచ్చటగానే మారాయి. మండల కేంద్రంలో ఏ వీధిలో చూసిన సీసీ కెమెరాలు పనిచేయని మూడో కన్నుగా మిగిలిపోయాయి. ఎప్పుడైనా దొంగతనాలు, ఇతర నేరాలు జరిగిన నిఘా లేక దుండగులను పట్టుకునేందుకు పోలీసులు అవస్థలు పడుతున్నారు. ఇదిలా ఉంటే బైక్ దొంగతనాలు, రాత్రివేళల్లో మందుబాబులు రోడ్డుపైనే మద్యం తాగడం, చిల్లర దొంగతనాలు నివారించుకుదామంటే సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. మండలంలోని ఆయా గ్రామాల్లో మొత్తం 150 సీసీ కెమెరాలు ఉండగా అందులో సగానికి పైగా గ్రామాల్లో సీసీ కెమెరాలు పని చేయడం లేదు. దీంతో వేల రూపాయలు ఖర్చు చేసిన సీసీ కెమెరాలు పర్యవేక్షణలో పోలీసులు పూర్తిగా విఫలమైనట్లు చెప్పుకోవచ్చు. అంతేకాకుండా గ్రామాల్లో చందా చేసి మరి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన వాటి పర్యవేక్షణ లేక పోయింది. దీంతో అవి వృధాగా మారాయి. ఏదైనా అనుకోని సంఘటనలు జరిగినప్పుడు నిందితులను గుర్తించుదామన్న సీసీ కెమెరాలు లేకపోలీసులు సతమతమవుతున్నారు. నిజామాబాద్-బాన్సువాడ ప్రధాన రహదారిపై ప్రయాణించే ప్రయాణీకులు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసు శాఖ పని చేయని సీసీ కెమెరాల పర్యవేక్షణ చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

సీసీ కెమెరాల మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం

• వెంకట్‌రావు, ఏఎస్‌ఐ

మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో సీసీ కెమెరాలు పని చేయడం లేదని తమ దృష్టికి వచ్చింది. వాటిని త్వరలోనే మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకోస్తామన్నారు. అదే విధంగా ప్రమాదాలు జరుగకుండా రాత్రివేళల్లో పెట్రోలింగ్ నిర్వహించి అరికడతాం. గ్రామాల్లో ఎవరైనా అనుమానస్పద వ్యక్తులు తిరిగితే ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలి.



జర దేఖో!!

బస్టాండ్ ప్రాంతంలో పని చేయని సీసీ కెమెరాలు

కలగానే నందిపేట బస్‌డిపో నిర్మాణం

• 30 ఏళ్లయినా లభించని మోక్షం • ప్రభుత్వాలు మారినా ప్రయాణికులకు తప్పని తిప్పలు
• పనికిరాని ఈడీ రహస్య పర్యటనలు • బీజేపీ ఆమరణ దీక్షకు దక్కని ఫలితం

ఆంధ్రజ్యోతి పరిశీలన



నందిపేట బస్‌డిపో స్థలం

నందిపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): 30 ఏళ్ల నిరీక్షణకు మార్గం ఇంకా సుగుమం కావడం లేదు. కొత్త బస్‌డిపోలు నిర్మించే ప్రసక్తి లేదని తిరగేసి చెప్పిన ఆర్‌టిసి బోర్డే నందిపేటలో బస్‌డిపో నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా అది కలగానే మారింది. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్, సీపీఐ, సీపీఎంలు చేసిన రాస్తారోకో, ధర్నాలు, బంద్‌లకు, బీజేపీ చేపట్టిన అమరణ నిరాహార దీక్షకు ఫలితం దక్కడం లేదు. ఇటీవల కాకతీయ రీజినల్ ఎగ్జ్యూక్యూటి డైరెక్టర్ రెండు సార్లు చేసిన రహస్య పర్యాటనలు పనికిరాకుండా పోయాయి. వారుతీసిన ఫొటోలు, వీడియో చిత్రికరణ ఉత్తుత్తిగానే మారింది.

30 ఏళ్లనాటి కల

30 సంవత్సరాల క్రిందట నందిపేట మండలకేంద్రంలో ఆర్టీసీ బస్‌డిపోను నిర్మిస్తామని అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తెలుగు దేశం ప్రభుత్వం సర్వేలు నిర్వహించింది. దానికి మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు తెల్ల రేషన్ కార్డుకు రు.5, గులాబి కార్డుకు రు.10 చొప్పున వసూలు చేశారు. అవి సరిపోకపోవడంతో విరాళాలు సేకరించారు. పోగైనా డబ్బుతో కొత్త బస్టాండ్ ప్రక్కనే నాలుగు ఎకరాల స్థలాన్ని రైతుల దగ్గర కొనుగోలు చేసి ఆర్‌టిసి అధికారులకు అప్పగించారు. నెలలు గడిచిన ప్రజా ప్రతినిధులు గాని, ఆర్టీసీ అధికారులు డిపో పనులు చేపడతామని, శంకుస్థాపన చేస్తామని చెప్పలేకపోయారు. అప్పటి ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, సీపీఐ, సీపీఎంలు బంద్‌లు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ ఏకంగా అమరణ నిరాహర దీక్ష చేపట్టింది. వరుసగా నాలుగు రోజుల పాటు బంద్‌ను నిర్వహించింది. డిచ్‌పల్లి ఎమ్మెల్యేగా ఉన్న మండవ వెంకటేశ్వర్ రావు స్పందించి త్వరలోనే బస్‌డిపో పనులు చేపడతామని స్థానిక నాయకుల ద్వారా హామీ ఇప్పించి దీక్షను విరమింపజేయించారు. అయినా నెలలు గడిచినా పనులు ప్రారంభం కాలేవు. కొద్ది రోజుల తర్వాత మండవ మంత్రి అయ్యారు. మండల పర్యాటనకు వచ్చిన ప్రతీ సారీ గ్రామస్తులు ఆయనను నిలదీశారు. అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడడంతో ఓటర్లను ఆకర్శించడానికి 13 డిసెంబరు 1998న అప్పుడు రాష్ట్ర రవాణ శాఖ మంత్రిగా ఉన్న కె.చంద్రశేఖర్ రావుతో శంకుస్థాపన చేయించారు. అదేరోజు మరో ముగ్గురు మంత్రులు (కోడెల శివప్రసాద్ రావు, నాగం జనార్ధన్‌రెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి) ఏర్పాటు చేయించిన బహిరంగ సభలో నెల రోజుల్లో పనులు ప్రారంభించి, త్వరలోనే పూర్తి చేయించి మళ్లీ తానే శంకుస్థాపన చేస్తానని కేసీఆర్‌తో హామీల వర్షం కురిపించారు. భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న మండవ వెంకటేశ్వర్ రావు ఎన్నికలకు ముందు, నేను బస్ డిపో నిర్మిస్తేనే వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేస్తానని లేకుంటే చేసేదే లేదని తెగేసి చెప్పారు. దీంతో ప్రజల ఆవేశాన్ని కొద్దిపాటిగా సద్దుమనిగేలా చేశాయి. తీరా మళ్ళి నెలలు గడిచాయి. డిపో నిర్మాణానికి టెండరు షెడ్యూళ్లు 1999 అక్టోబర్ 25నుంచి నవంబర్ 04 వరకు హైదరాబాద్‌లోని చీఫ్ సివిల్ ఇంజనీర్ కార్యాలయంలో దొరుకుతాయని పత్రికా ప్రకటన వచ్చింది. దీంతో డిపో అవుతుందని మండల ప్రజలు భావించారు. కాని నిర్మాణం పనులు టెండర్లకే పరిమితమైనాయి. నందిపేటలో బస్‌డిపో నిర్మించడానికి ఫీజిబిలిటీ లేదని, పైగా బోర్డులో నిధులు లేవని, కొత్త డిపోలు నిర్మించే ప్రసక్తి లేదని ఆర్టీసీ అధికారులు తెగేసి చెప్పారు. అటువంటప్పుడు అదే సమయంలో నిజామాబాద్‌లో డిపో-2 ఎలా నిర్మిస్తున్నారని మండల ప్రజలు ప్రశ్నించారు. అలా జరిగిన డిపో ప్రస్థానం ప్రహరీ నిర్మించే వరకు వచ్చింది. రూ.10లక్షలతో నిర్మాణం పూర్తయింది. అందులో పిచ్చి మొక్కలు మొలిచి పేకాట రాయుళ్లకు అడ్డాగా మారింది. అసాంఘిల కార్యకలాపాలకు అడ్డాగా మారింది. కొత్త రాష్ట్రం ఏర్పాడినా, మంత్రి ముఖ్యమంత్రి అయినా బస్‌డిపోకు మోక్షం లభించడం లేదు.ప్రతి పక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. బస్ డీపోలు నిర్మిస్తామని ప్రకటించింది. అయినా ఎలాంటి మార్పు కన్పించడం లేదు. 30 ఏళ్లుగా కలగానే మిగిలింది. ప్రయాణీకుల తిప్పలలో ఎటువంటి పురోగతి రాలేదు.




శంకుస్థాపన చేస్తున్న అప్పటి మంత్రులు (ఫైల్)



ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న గ్రామస్థులు (ఫైల్)

బ్రిడ్జి నిర్మించినా బస్‌డిపోకు మోక్షం కలుగలేదు

• గజ్‌బీంకర్ జ్యోతి నారాయణ, టీడీపీ జిల్లా నాయకులు, నందిపేట



ఆదిలాబాద్ జిల్లా లోకేశ్వరం మండలం పంచగుడి, నందిపేట మండలం ఉమ్మెడ గ్రామా శివారులను కలుపుతూ గోదావరి నదిపై బ్రీడ్జీ నిర్మిస్తే నందిపేటలో బస్‌డీపో నిర్మాణానికి మోక్షం కలుగుతుందని అందరూ భావించారు. వంతెన పూర్తయి సంవత్సరాలు గడుస్తున్నా ఏలాంటి మార్పు కన్పించడం లేదు. వంతెన నిర్మాణంతో రూట్లు ఎక్కువగా పెరిగాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి. త్వరలోనే ప్రభుత్వ పెద్దలను కలిసి నందిపేటలో బస్ డీపో ఆవశ్యకతను వివరిస్తాం.

మండలంలో రూరల్ ఎమ్మెల్యే పర్యటన



ధర్పల్లిలో వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ధర్పల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):మండలంలో ఆదివారం రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి పర్యటించారు. దుబ్బాక గ్రామ శాఖ అధ్యక్షుడు పోతరెడ్డి కుమారుని వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రమేష్‌గౌడ్ తల్లి ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, గాదారి మనోహర్‌రెడ్డి, మిట్టపల్లి గంగారెడ్డి, చెలిమెల నర్సయ్య, చెలిమెల శ్రీనివాస్, సుభాష్, గంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలు



చిత్రలేఖనంలో పాల్గొన్న విద్యార్థులు

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని పాఠశాల స్థాయి విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఆదివారం జిల్లా కేంద్రగ్రంథాల యంలో పుస్తక పఠనం చేస్తున్న పాఠకులు అనే అంశంపై నిర్వహించిన చిత్రలేఖనం పోటీలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ రాజిరెడ్డి, అసిస్టెంట్ లైబ్రేరియన్ తారకం, డ్రాయింగ్ పోటీ న్యాయనిర్ణేత రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మానవతా సదన్‌లో వైద్య శిబిరం



మానవతా సదన్‌లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

డిచ్‌పల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వెనుకగల మానవతా సదన్‌లో నిజామాబాద్ ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్‌ను ఆదివారం నిర్వహించారు. ప్రముఖ వైద్య నిపుణులు బండారు ఉషా 54 మంది విద్యార్థులకు హెచ్‌వీపీ వ్యాక్సిన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ప్రభుత్వ పరంగా కావాల్సిన వైద్య శిబిరాలు తాము నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సదరం ఇంచార్జి రమేష్, ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రతినిధులు సునీత జైన్, తేజస్విని, కవిత, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కోచైర్మన్ల నియామకం

నిజామాబాద్‌అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మాల సంఘాలన్నీ కలిపి ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితిని ఏర్పాటు చేశారు. ఈ సమితికి రాష్ట్ర చైర్మన్‌గా చిన్నయ్య ఎన్నిక కాగా నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎడ్ల నాగరాజు, అంగిరి ప్రదీప్‌లు రాష్ట్ర కోచైర్మన్‌లుగా నియమితులయ్యారు. మాలలందరిని ఐక్యం చేస్తూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని నాగరాజు తెలిపారు. తనను రాష్ట్ర కోచైర్మన్‌గా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా వెనిగళ్ల సురేష్



సురేష్

నిజామాబాద్ అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా వెనిగళ్ల సురేష్ రెండోసారి ఎన్నికయ్యారు. ఆదివారం శంకర్ భవన్ పాఠశాలలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.మహేం దర్‌రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా వెనిగళ్ల సురేష్, ప్రధాన కార్య దర్శిగా పూదారి అర్విందు,ఉపాధ్యక్షుడిగా మల్లేషం, భారతి, ఇబ్రహీం, గంగా ప్రసాద్, జిల్లా కార్యదర్శులుగా రేణుక, సురేస్, నరేందర్, రామకృష్ణ, తదిత రులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఉపాధ్యాయ సమస్యల పై నిరం తరం పోరాటం చేయడంతో పాటుజిల్లాలో టీపీటీఎఫ్‌ను బలో పేతం చేసేం దుకు కృషిచేస్తామని జిల్లాఅధ్యక్ష, కార్యదర్శులు సురేష్, అర్విందులు తెలిపారు.

క్రీడల ద్వారానే ఆరోగ్యం

● బ్యాడ్మింటన్ పోటీల ముగింపు కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయాధికారి సునీత కుంచాల



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల

సుభాష్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): క్రీడలు ఆడటం ద్వారానే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని నిజామాబాద్ జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఓపెన్ మాస్టర్ బ్యాడ్మింటన్ పోటీల ముగింపు కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడల్లో పాల్గొనడం గొప్ప విషయమని పాల్గొ న్నవారందరూ విజేతలే అన్నారు. నిజామాబాద్ జిల్లా ఆతిథ్యం బాగుంటుం దని అన్నారు. 35 సంవత్సరాల నుంచి 75 సంవత్సరాల క్రీడాకారులు ఈ పోటీలో పాల్గొనడం అభినందనీయమని అన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా పోటీలో పాల్గొని విజేతలుగా నిలవడం ఆనందం కలిగిస్తుందన్నారు. అనంతరం ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ మాట్లాడుతూ జిల్లాలో రాష్ట్రస్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఆటగాళ్లు ఉన్నారని అన్నారు. జిల్లాలో క్రీడలకు ఆతిత్యం ఇవ్వడం కొత్తేమి కాదని అన్నారు. ఆఫీసర్స్ క్లబ్‌లో స్విమ్మింగ్‌పూల్ నిర్మాణానికి సహాయ సహకారాలు అందించాల న్నారు. అనంతరం విజేతలకు జిల్లా జడ్జి చేతుల మీదుగా బహు మతులను అందజేశారు. 65 సంవత్సరాల కేట గిరిలో నిజామాబాద్ జిల్లా జట్టు హైదరాబాద్ జట్టుపై ఘనవిజయం సాధించింది. 50-55 సంవత్సరాల రెండు విభాగాల్లో ఆఫీసర్స్‌క్లబ్ కార్యదర్శి తన సోదరుడితో కలిసి విజయం సాధించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్, బాస్కెట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రాజేందర్‌రెడ్డి, ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి చిలువేరి సత్యనారాయణ, వెంకట్రాములు, గంగాకిషన్, అంగిరేకుల సాయిలు, ఏటీఎస్ శ్రీనివాస్, కెప్టెన్ అకాడమి చైర్మన్ అర్విందు, మురళి, సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ దుర్గమాతను దర్శించుకున్న జిల్లా న్యాయాధికారి

ముప్కాల్: బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల పక్కన ఉన్న దుర్గామాత ఆలయాన్ని ఆదివారం జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల, ఆర్మూర్ మెజిస్ట్రేట్ దీప్తి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బూస సునీత నరహరిలు ఆమెకు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు.

వ్యాపార అభివృద్ధి సంస్థలుగా మార్చడానికి కృషి

● ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్‌నాయక్



మాట్లాడుతున్న తెలంగాణరాష్ట్ర సహకార సంఘం చైర్మన్

ఖిల్లా, నవంబరు17(ఆంధ్రజ్యోతి):సహకార సంస్థలను వ్యాపార అభివృద్ధి సంస్థలుగా మార్చడానికి అన్ని విధాల కృషి చేస్తున్నామని తెలంగాణా రాష్ట్ర సహకార సంస్థ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారచంద్‌నాయక్‌లు అన్నారు. సహకార సంస్థల వ్యాపార అభివృద్ధి సంస్థలుగా మార్చడానికి అను అంశం సదస్సు కార్యక్రమాన్ని71వ అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా ఐడీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణా రాష్ట్ర సహకార సంఘ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ టీఎస్ సీఏబీ, డీసీసీబీ మాదిరిగా మార్క్‌ఫెడ్, డీసీఎంఎస్‌లు కూడా కలిసి పని చేయాలని ఈవిషయాన్ని రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ మంత్రుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. గ్రామ స్థాయి నుంచి దేశ స్థాయికి ఉన్న సహకార వ్యవస్థను ముందు తరాల వారికి భవిష్యత్తు కార్యక్రమాల గురించి తెలియజేయడం జరుగుతుందన్నారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న టీఎస్‌సీయు ప్రిన్సిపల్ వెంకన్న మాట్లాడుతూ వ్యవసాయానికి సంబంధించిన వ్యాపారాలు కాకుండా వ్యవసాయ సంబంధిత ఇతర వ్యాపారాలు నిర్వహించి సహకార సంఘాలను అభివృద్ధి చేయాలన్నారు. దేశ వ్యాప్తంగా ఈ సహకార వ్యవస్థ మరింత బలపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డీసీసీబీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఎంసీ డైరక్టర్, బర్దీపూర్ సొసైటీ చైర్మన్ రామకృష్ణ, మోపాల్ సొసైటీ చైర్మన్ గంగాధర్,ఐడీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ కే.నగేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కోటగల్లిలో ఘనంగా బోనాల పండుగ



మోస్రాలో బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

నిజామాబాద్‌కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాడి పంటలతో సంతోషంగా ఉండాలని వేడుకుంటూ ప్రతియేటా కార్తీకమాసంలో అమ్మవారికి సమర్పించే బోనాల పండుగ ఘనంగా సాగింది. ఆదివారం జిల్లా కేంద్రంలోని కోటగల్లి మాల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల పండుగలో పెద్ద ఎత్తున మహిళలు బోనాలను అమ్మవారికి సమర్పించుకున్నారు. మాల సంఘంలో బోనాలను పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించి అటుతర్వాత బోనాలను నెత్తిన పెట్టుకొని పోతలింగయ్య గుడి, పోచమ్మగల్లిలోని పెద్దమ్మ ఆలయంకు ఊరేగింపుగా బోనాలను సమర్పించుకున్నారు. బోనాల ఊరేగింపులో భక్తులు నృత్యాలు చేస్తూ డప్పు వాయిద్యాలతో ఘనంగా ఎదుర్కొంటూ అమ్మవారికి బోనాలను సమర్పించారు. అమ్మ మమ్మల్ని చల్లగా చూడు అని వేడుకుంటూ ప్రతియేటా వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో చల్లగా ఉండాలని వేడుకుంటూ బోనాన్ని అమ్మకు అందించారు. ఈ కార్యక్రమంలో కోటగల్లి మాలసంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి అనిల్, కోశాధికారి రాములు, ముఖ్య సలహాదారులు లక్ష్మీనారాయణ, గౌరవ అధ్యక్షుడు సతీష్, నాయకులు బాల్‌రాజ్, రాజారావు, ప్రసాద్, శ్రావణ్, కృష్ణ, నారాయణ, గంగాధర్, పోచయ్య, సన్నీ, రంజిత్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

● ఘనంగా బద్ది పోచమ్మ బోనాల పండుగ

మోస్రా: మండలంలోని గోవూరు గ్రామంలో ఆదివారం ఆదివాసి నాయక్ పోడ్ సంఘం ఆధ్వర్యంలో బద్ది పోచమ్మ అమ్మవారి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం పౌర్ణమి రోజున కుల దేవత భీమన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బద్ది పోచమ్మకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి నాయక్‌పోడ్ సంఘం సభ్యులు, కులస్థులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఏర్గట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ నాయ కులు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధిత కుటుంబ సభ్యుల ఇంటి వెళ్ళి నేరుగా అంద జేశారు. గ్రామంలో ముగ్గురికి లక్ష ఏడు వేలు మంజూరీ అయినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకున్న తమకు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరీకి కృషి చేసిన బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బద్దం లింగారెడ్డి, పన్నాల నర్సారెడ్డి, గడ్డం జీవన్, ముస్కు మోహన్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పుణ్యప్రదం కార్తీక మాసం



మాట్లాడుతున్న కృష్ణానంద స్వామి

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):దామోదరుడికి అత్యధిక ప్రీతికరమైంది కార్తీకమాసం అని కార్తీకమాసంలో చేసే పూజా పుణ్యప్రదం అని కృష్ణానంద స్వామి అన్నారు. ఆదివారం నగరంలోని సుభాష్‌నగర్‌లోగల శ్రీ చాతాద శ్రీవైష్ణవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వివాహ పరిచయ వేదికలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్తీక విశిష్టతను వివరించారు. పూర్వజన్మ పుణ్యప్రభావం వల్ల మానవ జన్మ వచ్చిందని మంచి ప్రవర్తనతో కర్మను ఆచరిస్తే భగవంతుని సాన్నిధ్యం లభిస్తుందని అన్నారు. అనంతరం రామాంజ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన చాతాద శ్రీవైష్ణవ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

డిచ్‌పల్లి,నవంబరు17(ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి గ్రామ శివారులోగల బొమ్మలగుండు ఆలయం వద్ద శివపార్వతుల కల్యాణం ఆదివారం ఘనంగా జరిగింది. ఆలయ నిర్వాహకులు కల్యాణోత్స వానికి భారీ ఏర్పాట్లు చేశారు. అన ంతరం హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు. ప్రముఖ సంగీత విద్వాంసులు భూమయ్య మహారాజ్ సం గీతం ఆలపించారు. ఈకార్యక్ర మంలో మురళి, సంతోష్, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రేకులపల్లిలో సత్యసాయి సేవా సమితి ఏర్పాటు

ధర్పల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక సేవా మార్గంలో యువత ముందుండాలని సత్య సాయి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. మానసిక, ప్ర శాంతతకు ఆధ్యాత్మికత ఇప్పుడున్న పరిస్థితుల్లో అవసరం అన్నారు.

రేపు జిల్లాస్థాయి జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ ఎంపికలు

సుభాష్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):ఈనెల 19న జిల్లా స్థాయి జూనియర్ బాలబాలికల హ్యాండ్‌బాల్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గంగామోహన్‌చక్రు, పింజ సురేందర్‌లు తెలిపారు. ఆలూర్ మండలం కల్లెడ ఉన్నత పరిషత్ పాఠశాలలో ఈఎంపికలను నిర్వహించనున్నట్లు తెలిపారు. 1-1-2005 నుంచి 31-12- 2008 మధ్యల జన్మించిన వారు ఉండాలని అన్నారు. ఆసక్తిగల క్రీడా కారులు జనన ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 10గంటల వరకు మైదానానికి చేరుకోవాలన్నారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. మిగతా వివరాల కోసం 9642535535, 9440441 757ను సంప్రదించాలని కోరారు.

శివాలయం విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

నవీపేట,నవంబరు17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నందిపేట రోడ్డు సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీ శివ పంచాయతన శివాలయం విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి.ఈనెల 17నుంచి 21వ తేది వరకు విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఉత్సవాలలో భాగంగా మొదటి రోజైన ఆదివారం యాగశాల నిర్మాణం, స్థల ఆలయ శుద్ధార్థం, సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 21 గురువారం రోజున విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నారు.

జిల్లాలో మొదలైన యాసంగి సాగు

(ఐదో పేజీ తరువాయి)

సహకార సంఘాలు, మార్క్‌ఫెడ్ ద్వారా విత్తనాలను సరఫరా చేస్తున్నారు. జిల్లాలో వరిసాగు ఎక్కువగా కానుండటంతో లక్షా 4వేల 942 క్వింటాళ్ల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచారు. గత కొన్ని రోజులుగా పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో మొక్కజొన్న సాగు కోసం 1834 క్వింటాళ్లను, శనగ సాగు కోసం 4,019 క్వింటాళ్లను అందుబాటులో ఉంచారు. వీటితో పాటు ఇతర ఆరుతడి పంటలకు అవసరమైన విత్తనాలను అందుబాటులోకి తెచ్చారు. రైతులు ఈ విత్తనాలతో పాటు ప్రైవేటు కంపెనీలకు సంబంధించిన ఫౌండేషన్, ఇతర విత్తనాలను వినియోగిస్తున్నారు. ఎక్కువ దిగుబడి వచ్చే వంగడాలను సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు.

జిల్లాలో యాసంగి సాగు మొదలు కావడంతో అవసరమైన ఎరువులను వ్యవసాయ శాఖ అందుబాటులోకి తెచ్చింది. ఈ సీజన్‌లో యూరియా 75వేల మెట్రిక్ టన్నులు, డీఏపీ 18,951 మెట్రిక్ టన్నులు, న్యూరెటాఫ్ ఫాస్పెడ్ 12,618, కాంప్లెక్స్ 46,367 మెట్రిక్ టన్నుల ఎరువులను అందుబాటులో ఉంచారు. ఈ సీజన్‌లో రైతులకు నానో ఎరువులు, ఇతర కాంప్లెక్స్ ఎరువులను వాడే విధంగా అవగాహన కల్పించేందుకు సిద్ధమవుతున్నారు. డీఏపీ స్థానంలో ప్రత్యామ్నాయ ఎరువులను, సేంద్రియ ఎరువులను వాడే విధంగా ఏర్పాట్లను చేస్తున్నారు. డీఏపీ లభ్యత తక్కువగా ఉండటం వల్ల సేంద్రియ ఎరువులను వాడే విధంగా రైతులను ప్రోత్సహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రైతువేదికల ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. డీఏపీకి బదులుగా నానో డీఏపీ, ఎస్ఎస్‌పీ, పాస్పెట్‌కు సంబంధించిన ఎరువులను ప్రోత్సహించేందుకు సిద్ధమవుతున్నారు. కరపత్రాలు, పోస్టర్లు, సామాజిక మాధ్యమాల ద్వారా రైతులకు అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో యాసంగి సాగు మొదలైందని రైతులకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను చేశామని జిల్లా అధికారులు వాజీద్ హుస్సేన్ తెలిపారు. జిల్లాలో రైతులు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించుకొని నీటి వనరులకు అనుగుణంగా పంటల సాగును కొనసాగించాలని ఆయన కోరారు.

'మహా' ఎన్నికల ప్రచారంలో మనోళ్లు!

(ఐదో పేజీ తరువాయి)

నాందేడ్ జిల్లా పరిధిలో ప్రచారం నిర్వహిస్తున్నారు. నాందేడ్ జిల్లాలో మొత్తం ఏడు నియోజకవర్గాలు ఉన్నాయి. నాందేడ్ నార్త్, నాందేడ్ సౌత్, నాయగామ్, భోకర్, ముద్కేడ్, దెగ్లూర్, కిన్వట్ నియోజకవర్గాలు ఉన్నాయి. మహారాష్ట్రలోని ఈ నాందేడ్ జిల్లా ఉమ్మడి జిల్లా సరిహద్దులను ఆనుకొనే ఉంది. ఈ ఉమ్మడి జిల్లాతో పాటు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా సరిహద్దులు కూడా కలిసి ఉంటాయి. సరిహద్దుల వెంట కిన్వట్, ముద్కేడ్, భోకర్, దెగ్లూర్, నయగామ్ నియోజకవర్గాలు ఉన్నాయి. మహారాష్ట్రలో ఈ దఫా ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా కొనసాగుతున్నాయి.

తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల వెంట ఉన్న జిల్లాలపై రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం దృష్టి పెట్టింది. ఏఐసీసీ నేతల ఆదేశాలతో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఎంపీ సురేస్ షెట్కార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు లక్ష్మీకాంత్‌రావుతో పాటు ఇతర నేతలు ప్రచారాల్లో పాల్గొంటున్నారు. రెండు రోజులుగా సీఎం రేవంత్‌రెడ్డి చంద్రాపూర్, యావత్‌మాల్, నాందేడ్, సోలాపూర్ జిల్లాల ప్రాంతాల్లో పర్యటించారు. అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం కొనసాగిస్తున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్కతో పాటు ఇతర నేతలు మహారాష్ట్రలో ఉండి ఎన్నికలను పర్యవేక్షిస్తున్నారు. అభ్యర్థులకు మద్దతుగా ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా భోకర్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులతో కలిసి పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల మాదిరిగానే బీజేపీ నేతలు కూడా గత కొన్ని రోజులుగా మహారాష్ట్రలో ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. సరిహద్దుల జిల్లాలోని పలు నియోజకవర్గాల పరిధిలో ఇన్‌చార్జిలుగా ఉండి ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఉమ్మడి రెండు జిల్లాల పరిధిలోని నేతలు ఈ ప్రచారాల్లో పాల్గొంటున్నారు. జిల్లాకు చెందిన ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మహేశ్వర్‌రెడ్డి, రామారావు పాటిల్, పాయల్ శంకర్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, ఇతర నేతలు ఈ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. బీజేపీ కూటమికి చెందిన అభ్యర్థుల గెలుపు కోసం నాందేడ్, యావత్‌మాల్, చంద్రాపూర్, గచ్చిరోల్ జిల్లాల పరిధిలోని పలు నియోజకవర్గాల్లో పర్యటిస్తూ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. రెండు రోజుల క్రితం జరిగిన ఎన్నికల ప్రచారంలో ఏపి డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌తో కలిసి ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థి



భూమేష్

మెండోర, నవంబరు17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలకు పోచంపాడ్ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు భూమేష్, రాకేష్ ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ సురేందర్ తెలిపారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా తాండూర్‌లో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ అండర్-17 ఖోఖో విభాగంలో భూమేష్ ఖమ్మం జిల్లా సర్దార్ వల్లబాయ్‌పటేల్ మైదానంలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ అండర్-14 బాలుర విభాగంలో రాకేష్ హైజంప్, షాట్‌పూట్ విభాగంలో రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యాని పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడానికి కృషి చేసిన వ్యాయమ ఉపాధ్యాయుడు సంజీవ్, ఏటిపి హరిష్ గౌడ్‌లకు పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.